# క్రీడాకారులు సత్తా చాటాలి

- రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలి
- జడ్పీ కోఆప్షన్ మెంబర్ వలియాబీ
- జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వలియాబీ

ఏటూరునాగారం, అక్టోబర్ 3 : క్రీడల్లో తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని స్థానిక జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, క్రీడల సెక్రటరీ విజయమ్మ, బద్దం సుదర్శన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలను బుధవారం ప్రారంభించారు. జిల్లాలోని తొమ్మిది మండలాల నుంచి 14, 17 ఏళ్లలోపు బాల బాలికలు 1600 మంది కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి ములుగు జిల్లాకు గుర్తింపు తేవాలన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో మైదానాలు ఏర్పాటు చేసి ఉచితంగా క్రీడా సామాగ్రిని అందజేస్తున్నదని వలియాబీ తెలిపారు. అదే తరహాలో విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలను నిర్వహిస్తున్నదన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ ఓడిన క్రీడాకారులు అసంతృప్తికి గురికాకుండా పట్టుదలతో మరోసారి విజయం కోసం పోటీ పడాలని వలియాబీ సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో నరేందర్, హెచ్ఎంలు వాసం ప్రసాద్, మల్లయ్య, గేమ్స్ సెక్రటరీ మదన్ మోహన్, ఫిజికల్ డైరెక్టర్లు ఆదినారాయణ, రమేశ్, వెంకన్న, పీఈటీలు స్వరూప, శ్రీనివాస్, బాలరాజు, రవి, మల్లయ్య, వేణు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న బాలికలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఏటూరునాగారం, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని ఆకులవారిఘనపూర్ హెల్త్ సబ్ సెంటర్‌లో ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, గర్భిణులకు రక్త, టీబీ లక్షణాలున్న వారికి తెమడ తదితర ఎనిమిది రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య లక్షణాలు కన్పించినా వెంటనే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలోఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు సుమలత, చాముండేశ్వరి, సుచరిత, సూపర్‌వైజర్లు కమల, శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జ్ఞానస

## గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాజేడు, అక్టోబర్ 3 : మండలంలోని ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన పరిధిలోని బొల్లారం, బిజినేపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్యాధికారి జ్ఞానస ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు, గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది స్రవంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న పీవో అంకిత్

## నాణ్యమైన ఆహారం అందించాలి

**ఐటీడీఏ పీవో అంకిత్**

**కర్లపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ**

గోవిందరావుపేట, అక్టోబర్ 3 : ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని కర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు స్టడీ అవర్‌లో ఉండగా, వారి వివరాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కిచెన్‌లో వండిన ఆహారంతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. అనంతరం వార్డెన్‌తో మాట్లాడుతూ క్యాంపస్‌లో పరిశుభ్రతను పాటించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని వార్డెన్‌కు పీవో సూచించారు.


పోడు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

## పోడు పట్టాలు, బతుకమ్మ చీరెలు పంపిణీ

వాజేడు, అక్టోబర్ 3 : మండలంలోని ప్రగళ్లపల్లి, గుమ్మడిదొడ్డి, పెద్ద గొల్లగూడెం గ్రామాల పోడు రైతులకు మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పట్టాలు పంపిణీచేశారు. అలాగే బతుకమ్మ చీరెలను ఆడపడుచులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఆర్ఐ కిసరి రాజు, జడ్పీటీసీ తల్లడి పుష్పలత, మొరుమురు సర్పంచ్ పూసం నరేశ్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశానికి 9న స్పాట్ కౌన్సెలింగ్

ఏటూరునాగారం, అక్టోబర్ 3 : ఐటీఐలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై వారు వివిధ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 8 వరకు ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తవారే కాకుండా గతంలో దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 9న నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, అడ్మిషన్ ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ప్రభుత్వ దవాఖానల్లోనే మెరుగైన వైద్యం

- డీఎంహెచ్‌వో అప్పయ్య


చిన్నారిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

కన్నాయిగూడెం, అక్టోబర్ 3 : ప్రభుత్వ దవాఖానల్లో అందిస్తున్న మెరుగైన వైద్యం, మందులతోనే దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. మండలంలోని పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మేళాలో అప్పయ్య పాల్గొని మాట్లాడారు. గర్భిణులు సరైన పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి తగిన వైద్య సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రోగాలకు మందులు, సేవలు అందుతున్నాయని, ప్రైవేట్‌లో చికిత్స పొంది డబ్బులు వృథా చేసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని టీబీ రోగులతో మాట్లాడారు. అందులో ఒకరికి పూర్తిగా టీబీ తగ్గిందని చెప్పడంతో అతడిని డీఎంహెచ్‌వో, పీహెచ్‌సీ వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో అభినవ్, ఉషారాణి, అన్మిషా, గిరి, ప్రణీత్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## టీఎస్ ఆర్టీసీ బస్టాండ్ స్థలం సర్వే


ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని సర్వే చేస్తున్న ఏఈ బాబా

మంగపేట, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన టీఎస్ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని మంగళవారం ఆ సంస్థకు చెందిన ఏఈ బాబా సర్వే నిర్వహించారు. ఆర్టీసీ ఈఈ జే భాస్కర్ సూచనల మేరకు స్థలం పరిశీలించి విస్తీర్ణాన్ని కొలిచేందుకు వచ్చినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాగా మంగపేట బస్టాండ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.51 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రోజునే ఆ ర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేయడంపై మం డల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిధుల మంజూరు హర్షణీయం**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఉన్న ఆర్టీసీ స్థలంలో బస్టాండ్ నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 51 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిధుల మంజూరు సహకరించిన మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావుకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

### రామప్పలో లడ్డూ, పులిహోర

## విక్రయాలకు వేలం

**సమకూరిన రూ. 2.69 లక్షల ఆదాయం**

వెంకటాపూర్, అక్టోబర్ 3 : మండలంలోని రా మప్ప దేవాలయంలో లడ్డూ, పులిహోర విక్రయాలకు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు మంగళవా రం వేలం నిర్వహించగా రూ. 2,69,500 ఆదాయం వచ్చినట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో లడ్డూ, పులిహోర విక్రయానికి వేలం నిర్వహించగా బొమ్మగాని అయ్యప్ప రూ. 2 లక్షలకు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు ప్రసాద్ రూ. 69,500కు దక్కించుకున్నారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాష్, ఎం సంతోష్, జీ సంతోష్, దామోదర్, రత్న తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

కన్నాయిగూడెం, అక్టోబర్ 3 : మండలంలోని గూర్రేవుల గ్రామానికి చెందిన ఆకుతోట శ్రీధర్ (50) మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగి హత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన ప్రకారం శ్రీధర్ కూతురుకు ఇటీవల వివాహం కుదిరింది. ఈ నేపథ్యంలో ఖర్చులు పెరుగుతున్నాయని భార్యా భర్తలు తరచూ గొడవ పడేవారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీధర్ ఉదయం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. కూతురు రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ములుగు రూరల్, అక్టోబర్ 3 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంపై రూపొందించిన అవగాహన పోస్టర్లను సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో ప్రేమలత మాట్లాడుతూ బాలికలు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నరేశ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు